



సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 12-7-2025

సంపుటి: 21 సంచిక: 94

పేజీలు: 8 వెల: రూ.1






● ఎడిటోరియల్

# మోదీ పదవి నుంచి దిగిపోతారా?


మరో రెండు నెలల్లో దేశ రాజకీయాల్లో పెనుమార్పులు జరగనున్నాయా? ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతున్న ఎన్డీయే ప్రధాన భాగస్వామి బీజేపీలో నాయకత్వ మార్పిడి జరగనుందా?? అన్నింటికీ మించి హ్యాట్రిక్ విజయాలతో మూడోసారి ప్రధాని పీఠంపై కూర్చున్న నరేంద్ర మోదీ సెప్టెంబర్‌లో ఆ పీఠం నుంచి దిగిపోనున్నారా? అన్న చర్చ జాతీయస్థాయిలో జరుగుతోంది. సంఘ్ పరివార్‌లో పెద్దన్న వంటి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఇటీవల ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలే కేంద్ర నాయకత్వంలో మార్పుపై విస్తృత చర్చకు ఆస్కారమిచ్చాయి. దీనిపై కాంగ్రెస్, బీజేపీలు సైతం స్పందించి తమ వైఖరిని వెల్లడించేలా వ్యాఖ్యలు చేయడం మరింత వేడి పుట్టిస్తోంది. మొత్తం మీద బీజేపీలోనూ, సంఘ్ పరివార్‌లోనూ అధికార మార్పిడి దిశగా ఏదో జరుగుతోందన్న అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. 75 ఏళ్లు వస్తే భుజంపై కండువా తీసి పక్కన పెట్టాలని, అంటే పదవుల నుంచి తప్పుకొని యువనేతలకు అవకాశం ఇవ్వడమేనని దివంగత సంఘ్ నేత మోరోపంత్ పింగ్లే చేసిన వ్యాఖ్యలను మోహన్ భగవత్ తాజాగా ప్రస్తావించడం చర్చనీయాంశమైంది. మరోవైపు 74 ఏళ్లు దాటిన నాయకులకు రాజకీయ రిటైర్మెంట్ ఇచ్చే సంప్రదాయం బీజేపీలో ఉంది. పార్టీ నిబంధనావళిలో ఆ అంశం లేకపోయినా.. అదొక అలిఖిత నిబంధనగా అమలవుతోంది. దాని ప్రకారమే గతంలో ఎల్‌కే అద్వానీ, మురళీమనోహర్ జోషి, వెంకయ్యనాయుడు అంటి అగ్రనేతలకు పార్టీ రిటైర్మెంట్ ఇచ్చి ఇళ్లకు పంపించేసింది. ఆ నిబంధన నరేంద్ర మోదీకి కూడా వర్తించాల్సిందేనన్నది మోహన్ భగవత్ సూచనగా భావిస్తున్నారు. ప్రధాని మోదీ మరో రెండు నెలల్లో 75 ఏళ్లు పూర్తి చేసుకుంటారు. సెప్టెంబర్ 17న ఆయన జన్మదినం. అందువల్ల పార్టీ సంప్రదాయం ప్రకారం ఆ నెలలో ఆయన స్వచ్ఛందంగా ప్రధాని పదవి నుంచి దిగిపోయి పార్టీ ఎంపిక చేసే తన వారసుడికి అప్పగిస్తారన్న చర్చ జరుగుతోంది. ఇటీవల శివసేన కీలక నేత, ఎంపీ సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలు కూడా మోదీ రిటైర్మెంట్‌పై ఊహాగానాలు రేపుతున్నాయి. ప్రధాని మోదీ సెప్టెంబర్‌లో రిటైర్ కావాలనుకుంటున్నారని, అందుకే చాలాకాలం తర్వాత ఆయన సడెన్‌గా నాగ్‌పూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారని ఆయన వ్యాఖ్యానించారు. మోదీ వారసుడిని త్వరలోనే ఆర్ఎస్ఎస్ నిర్ణయిస్తుందని కూడా అన్నారు. ఈ వ్యాఖ్యలతో దేశవ్యాప్త చర్చ ఆరంభమైంది. తాజాగా మోహన్ భగవత్ వ్యాఖ్యలతో.. పదవిని వీడమని మోదీకి సంఘ్ పరివార్ హింట్ ఇచ్చినట్లేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఆర్ఎస్ఎస్ నిబంధనల ప్రకారం బీజేపీ నేతల్లో 75 ఏళ్లు దాటినవారు ఎవరూ కీలక పదవుల్లో ఉండకూడదు. అదే నిబంధన బీజేపీలో మోదీతో పాటు అదే సమయంలో 75 ఏళ్లు దాటనున్న మోహన్ భగవత్‌కు కూడా వర్తిస్తుందంటున్నారు. ఈ కారణంతోనే బీజేపీలో అత్యంత సీనియర్ నేత అయిన ఎల్‌కే అద్వానీకి 2014లో ప్రధాన మంత్రి పదవి చేపట్టే అవకాశం దక్కకుండా పోయింది. వయసు పరిమితుల కారణంగా సంఘ్ పరివార్ అద్వానీని కాదని అప్పట్లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీని ఎన్డీయే నుంచి ప్రధాని అభ్యర్థిగా బరిలోకి దించింది. కాంగ్రెస్ ఈ పరిణామాలపై స్పందించింది. భగవత్ వ్యాఖ్యలు మోదీ నుంచి ఉద్దేశించి చేసినవేనని కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ అన్నారు. మోదీతో పాటు భగవత్ కూడా దిగిపోవాల్సి ఉంటుందని.. ఇది ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్న నానుడిని గుర్తు చేస్తోందని వ్యాఖ్యానించారు. అయితే బీజేపీ నేతలు ఈ చర్చను, వాదనలను ఖండిస్తున్నారు. 75 ఏళ్లు నిండిన వారు పదవులు వీడాలని, లేదా పదవులు చేపట్టరాదన్న నిబంధన ఏదీ తమ పార్టీలో లేదని దేవేంద్ర ఫడ్నవిస్ వంటి పలువురు నేతలు చెబుతున్నారు. అందువల్ల నరేంద్ర మోదీ పదవి నుంచి దిగిపోవాల్సిన అవసరం లేదంటున్నారు. ఆ అలోచన కూడా పార్టీకి లేదన్నారు. గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో మోదీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రతిపక్షాలను చిత్తుగా ఓడించడంతో మోదీ వెళ్లిపోతేనే తమకు మనుగడ ఉంటుందన్న భావనతో ప్రతిపక్షాలు ఇలాంటి ఊసుపోని వ్యాఖ్యలు చేస్తున్నాయని విమర్శిస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ నెంబర్ టూగా ఉన్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా కూడా రిటైర్మెంట్‌పై ఇటీవల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయ జీవితం నుంచి రిటైర్ అయిన తర్వాత ప్రకృతి వ్యవసాయం చేస్తానని.. వేదాలు, ఉపనిషత్తుల పఠనంలో నిమగ్నం అవుతానని చెప్పడం గమనిస్తే మొత్తానికి బీజేపీలో ఏదో జరుగుతున్నట్లు కనిపిస్తోంది.

## వివిధ వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకోవడం కోసమే సుపరిపాలనలో తొలి అడుగు లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు చేపట్టిన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీకాకుళం నగర పరిధిలోని 11,12,13,14 వార్డులలో పార్టీ శ్రేణులతో కలసి ఆయన పర్యటించారు. గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, తొలి ఏడాది సాధించిన అభివృద్ధినీ వివరించారు. అనంతరం అయన మాట్లాడుతూ, అధికారం చేపట్టిన ఏడాదిలోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో అధిక శాతం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. నవ్యంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారు. తాము ఇచ్చిన హామీలను అమలు చేసాం కాబట్టే ధైర్యంగా తొలి అడుగుతో ప్రజల మధ్య వచ్చామని చెప్పారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ శీర రమణయ్య, పట్టణ అధ్యక్షులు మాదారపు వెంకటేష్, వార్డు ఇన్చార్జి తాళ్లూరి నవీన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇంచార్జిలు. క్లస్టర్ ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.





గడపగడపకు తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా 20వ డివిజన్ ఇన్‌చార్జ్ ఇప్పిలి తిరుమలరావు ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో 20వ డివిజన్ కన్వీనర్ కీర్తి భార్గవ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం.

## ఎయిర్‌పోర్ట్ పేరిట విధ్వంసం సృష్టించొద్దు




(సత్యంన్యూస్, పలాస)

కార్గో ఎయిర్పోర్ట్ పేరుతో బలవంతంగా భూసేకరణ ఎందుకు చేస్తున్నారో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని వామ పక్ష నాయకులు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోనారి మోహన్‌రావు, లిబరేషన్ పార్టీ నాయకులు మద్దిల రామారావు డిమాండ్ చేశారు. బలవంతం భూసేకరణ ఆపాలని కోరుతూ మందస మండలం రాంపురం బిడిమి గ్రామాల్లో చైతన్యయాత్రలను కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు రెవెన్యూ యంత్రాంగాన్ని పోలీసు యంత్రాంగాన్ని రైతాంగంపై భూముల కోసం ఎందుకు పంపిస్తున్నారని వారు ప్రశ్నించారు. దేశంలో ఢిల్లీ, బెంగు ళూరు, బొంబాయి, విశాఖపట్నం మొదలైన అన్ని నగరాల్లో ఎయిర్పోర్ట్‌కు అనుబంధంగా కార్గో ఎయిర్పోర్ట్ ఉందని దేశంలో ఎక్కడా కూడా ప్రత్యేకంగా కార్గో ఎయిర్పోర్ట్ లేదని మరి ఇక్కడ ఎందుకు కార్గో ఎయిర్పోర్ట్ పేరుతో భూములు గుంజుకోవడానికి ప్రయత్నిస్తున్నారో మౌనం వీడి ప్రజలకు సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలోనే అతి పెద్దదైన ఢిల్లీ ఎయిర్ పోర్ట్‌కి అనుబంధంగా ఉన్న కార్గో ఎయిర్పోర్టు 150 ఎకరాల్లో మాత్రమే ఉన్నదని గుర్తు చేశారు. జాతీయ అవార్డులు అందుకుంటున్న పలాస జీడిని కార్గో ఎయిర్పోర్ట్ పేరుతో విధ్వంసం ఎందుకు సృష్టిస్తున్నారో చెప్పాలన్నారు. కార్గో ఎయిర్పోర్ట్ పేరుతో లక్షలాది చెట్లను నరకడంవల్ల పర్యావరణ పరంగా శ్రీకాకుళం జిల్లాకు తీరని ముప్పు ఏర్పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల భూములు బలవంతంగా గుంజుకొని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం లక్షలాది చెట్లు నరకడం పాలకులు చేస్తున్న అభివృద్ధా లేదా విధ్వంసమా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మూడుసార్లు ఎంపీగా గెలిచి కేంద్రమంత్రిగా రామ్మోహన్‌నాయుడు జిల్లా ప్రాజెక్టులకు కేంద్రం నుంచి ఒక్క పైసా కూడా తేలేదు సరే కదా ఈరోజు కార్గో ఎయిర్పోర్ట్ పేర్లతో ప్రజల భూములు కార్పొరేట్లకు ఎందుకు కట్టబెడుతున్నారో తెలపాలన్నారు. బలవంత భూ సేకరణ వ్యతిరేకంగా ప్రజల మద్దతుతో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్గో ఎయిర్పోర్ట్ పోరాట కమిటీ నాయకులు పి.కుసుమ, కె.రమేషు,జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తేప్పల అజయ్‌కుమార్, సిఐటియు నాయకులు యన్.గణపతి, జోగి కోదండ, పత్రీ దానేషు, జె.భూపతి, డి.హరికృష్ణ, నీలకంతం, కోర్లహీమరావ్ చౌదరి, సంతోష్ నల్ల హడ్డి, వెంకట్రావు, చిత్త గున్నయ్య తదితరులు పాల్గొన్నారు

## సుందరవనంగా మారటం గొప్పగా ఉంది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పాత్రునివలస గ్రామాన్ని సుందరవనంగా మారటం గొప్పగా ఉందని విశ్రాంత విద్యాశాఖాధికారి బలివాడ మల్లేశ్వరరావు శనివారం అన్నారు. పాత్రునివలస టీచర్స్ కాలనీ, రామానగర్ పంచాయతీ రిజర్వు సైట్ 87సెంట్లలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఏర్పాటు చేసిన పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని మాజీ సర్పంచ్ పంచిరెడ్డి అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గొండు శంకర్ సహకారంతో పార్కును తీర్చిదిద్దామని, పర్యావరణారహిత జిల్లాగా మార్చటంలో తమ గ్రామ ప్రజలు మొక్కలునాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. పార్కులో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని చూస్తారని తెలిపారు. రానున్న మూడు నెలలలో ఈ పార్కులో రన్నింగ్ ట్రాక్, జిమ్ పరికరాలు పిల్లలుకు ఆట వస్తువులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఏడీ హార్టికల్చర్ పినపాటి ప్రసాద్, చిన్నారావు హార్టికల్చర్ ఆఫీసర్, సిఎంఎం.వెంకటరావు, ఆర్పీ బొట్టా కృష్ణవేణి, బగ్గ దేవి, గూరు రమాదేవి, రామానగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.నాగేశ్వరావు, వైస్ ప్రెసిడెంట్ సిహెహెచ్. మీనాక్షి, బి.శ్రీరాములు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.






క్యారెక్టర్ ఆర్టిస్టుగా ప్రయాణం మొదలుపెట్టి.. హీరోగా రాణిస్తున్న యువ నటుడు సుహాస్. కలర్ ఫొటో, రైటర్ పద్మభూషణ్, అంబాజీపేట మ్యారేజీబ్యాండు లాంటి చిత్రాలతో మెప్పించిన అతను.. ఇప్పుడు ‘ఓ భామ అయ్యో రామ’ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. దీని విశేషాలేంటో చూద్దాం పదండి.

# ఓ..భామ.. అయ్యో రామ!

కథ: రామ్ (సుహాస్) చిన్నతనంలోనే తల్లిదండ్రులకు దూరం అవుతాడు. అతణ్ని ఓ చేదు గతం వెంటాడుతుంటుంది. అతడికి అన్నీ తన మావయ్యే (ఆలీ). ఫారిన్ వెళ్లి ఎంఎస్ చేయాలన్నది అతడి కోరిక. డిగ్రీలో పద్ధతిగా చదువుకుంటూ తన లక్ష్యం వైపు అడుగులేస్తుంటాడు రామ్. ఓ యాక్సిడెంట్లో రామ్ కాపాడిన సత్యభామ (మాళవిక మనోజ్).. అతణ్ని ప్రేమిస్తుంది. రామ్ కూడా ఆమెను ఇష్టపడతాడు. ఇలా తన జీవితం సాఫీగా సాగిపోతున్న సమయంలో సత్యభామకు యాక్సిడెంట్ అవుతుంది. అప్పుడే తనను వెంటాడుతున్న చేదు గతం గుర్తుకొచ్చి ఇబ్బంది పడతాడు. ఇంతకీ తన గతమేంటి.. దాని వల్ల ఎదురవుతున్న ఇబ్బందిని అతనెలా అధిగమించాడు.. సత్యభామ-రామ్ ఒక్కటయ్యారా లేదా.. ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు తెర మీదే తెలుసుకోవాలి.

### కథనం-విశ్లేషణ:

హీరో చిన్నపుడు స్కూల్లో నాటకాలు వేసి ప్రశంసలు అందుకుంటాడు. తన టాలెంట్ చూసి పెద్దయ్యాక పెద్ద దర్శకుడు అయిపోతాడని చుట్టూ ఉన్న వాళ్లు పొగుడుతారు. కానీ దర్శకుడే అయిన అతడి తండ్రికి ఆ కొడుకంటే ఇష్టం ఉండదు. అతడిని వదిలించుకోవాలని చూస్తాడు. ఇంతలో తనెంతో ఇష్టపడే తల్లి కూడా దూరమవుతుంది. ఇది హీరో చిన్నతనానికి సంబంధించిన చేదు జ్ఞాపకం. దీనికి హీరో సినిమాల పట్ల అయిష్టత పెంచుకోవడానికి సంబంధమేంటో అర్థం కాదు. ఆ అయిష్టతను కూడా చిత్రమైన రీతిలో చూపిస్తారు. సినిమా థియేటర్‌కు వెళ్తాడట. కానీ లోపలికి వెళ్లకుండా బయటే ఉండి డైలాగులు మాత్రమే విని సినిమా హిట్టో ఫట్టో చెప్పేస్తాడట. ఈ టాలెంట్ చూసి హీరోయిన్ అతణ్ని దర్శకుడిని చేసేద్దాం అనుకుంటుంది. అనుకున్నదే తడవుగా ఒక స్టార్ డైరెక్టర్ దగ్గర అసిస్టెంట్ గా పెట్టించేస్తుంది. అక్కడ అతను ఏం టాలెంట్ చూపించాడు.. ఎలా డైరెక్టర్ అయ్యాడు.. తన ప్యాషన్ ఎలాంటిది.. ఇలా ఏమీ చూపించరు. కట్ చేస్తే అతను సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అయిపోతాడు. సినిమా డైరెక్టర్ అయిపోవడం ఇంత ఈజీనా అన్నట్లుంటుంది వ్యవహారం. దర్శకుడు కావడం.. ఒక కథను ఎంతోమందితో ఒప్పించి సినిమా తీయడం ఎంత కష్టమో ఓ భామ అయ్యో రామ తీసిన దర్శకుడికి తెలియకుండా ఉండదు. ఆ కష్టం తెలిసిన వాడు ఈ వ్యవహారాన్ని తెరపై ఇంత తేలిగ్గా ఎలా చూపించాడో మరి. ఈ పాయింట్ మాత్రమే కాదు.. ఓ భామ అయ్యో రామలో చూపించే చాలా విషయాలు ఇలాగే పైపైన అనిపిస్తాయి. సుహాస్ అంటే కథ బలంగా ఉంటుంది.. కొత్తగా ఉంటుంది అనే నమ్మకం మీద గట్టి దెబ్బ కొట్టే సినిమా ఇది. తాగి యాక్సిడెంట్ చేసే హీరోయిన్.. ఆమెను కాపాడి ఇంటికి చేర్చే హీరో.. ఆ సాయానికి ముగ్ధురాలై ఆమె ప్రేమిస్తే.. తన మీద చూపించిన శ్రద్ధకు ఫ్లాట్ అయిపోయి అతను ప్రేమలో పడిపోతాడు. ఇలాంటి రొమాంటిక్ ట్రాక్ చూశాక ఈ సినిమాలో కొత్తదనం ఆశించడం కష్టమే అవుతుంది. లవ్ స్టోరీయే ఇలా ఉంటే.. హీరో ఫ్లాష్ బ్యాక్ ఇంకో ప్రహసనం. మొదట్నుంచి హీరో గతం గురించి ఊరించి ఊరించి చివరికి ఆ గుట్టేంటో విప్పాక.. దీనికా ఇంత బిల్డప్ ఇచ్చారు అనిపిస్తుంది. తల్లీ కొడుకుల అనుబంధాన్ని.. వాళ్లిద్దరితో తండ్రికి ఉన్న సమస్యను సరిగా ఎస్టాబ్లిష్ చేయలేదు. ఫ్లాష్ బ్యాక్ మొత్తంగా తేలిపోవడంతో వర్తమానంలో దాని తాలూకు ఎమోషన్ ఏదీ కూడా వర్కవుట్ కాలేదు. ఇక లవ్ స్టోరీ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. హీరోయిన్ క్యారెక్టర్ని చాలా పేలవంగా.. గందరగోళంగా తీర్చిదిద్దడంతో ఏ దశలోనూ దాంతో కనెక్ట్ కాలేదు. అదే సమయంలో హీరో పాత్రతోనూ ఎమోషనల్ కనెక్ట్ ఉండదు. సన్నివేశాలు వస్తుంటాయి పోతుంటాయి. కానీ ఏ ఫీలింగ్ కలగదు. హీరోయిన్ చెప్పే సినిమా కథల తాలూకు ఊహా సన్నివేశాలు.. అక్కడక్కడా హీరో ఫ్రెండ్స్ ఇద్దరూ చేసే హడావుడి వల్ల కొంచెం కామెడీ వర్కవుట్ అయింది కానీ.. మిగతా వ్యవహారమంతా చాలా అసహనాన్ని కలిగిస్తుంది.

ప్రథమార్ధం.. ద్వితీయార్ధం.. లవ్ ట్రాక్.. ఎమోషనల్ సీన్స్.. ఇలా తేడాలేమీ లేవు. ఓ భామ అయ్యో రామలో అన్నీ ప్రేక్షకుల సహనాన్ని పరీక్షిస్తాయి. ఒకప్పుడు కథల ఎంపికలో మంచి అభిరుచిని చూపించిన సుహాస్.. ఇప్పుడు పట్టు కోల్పోతున్నాడనడానికి తాజా రుజువు.. ఓ భామ అయ్యో రామ. ట్రైలర్ చూస్తే ఇదో ఫన్ రైడ్ లాగా అనిపిస్తుంది కానీ.. పైపైన సాగే సన్నివేశాల వల్ల వినోదం పండలేదు. సరిగా డెవలప్ చేయని పాత్రలు.. కథాకథనాల వల్ల ఇందులో ఏ ఎమోషన్ తోనూ కనెక్ట్ కాలేం ద్వితీయార్ధంలో వచ్చే ఫ్లాష్ బ్యాక్.. పెళ్లి ట్రాక్.. పతాక సన్నివేశాలు ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెడతాయి. మొత్తంగా ఓ భామ అయ్యో రామ ఏ రకంగానూ ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. సుహాస్ కథలు.. పాత్రల ఎంపికలో జాగ్రత్త పడాల్సిన అవసరాన్ని ఈ సినిమా గుర్తు చేస్తుంది.

తుపాకి.కామ్ సౌజన్యంతో...

### నటీనటులు:

కలర్ ఫొటో సహా సుహాస్ హీరోగా నటించిన కొన్ని చిత్రాల్లో తన పాత్రలు.. నటన కొత్తగా అనిపించేవి. వాటిలో అమాయకత్వంతో కూడిన తన నటన ఆకట్టుకుంది. కానీ ఇప్పుడు అతను కొంచెం బోర్ కొట్టించేస్తున్నాడు. కారణం.. పాత్రలన్నీ ఒకేలా ఉండడమే. నటన కూడా మూసలో సాగిపోతున్నట్లు అనిపిస్తుంది. ఇందులో కూడా ‘హీరోయిజం’ చూపించకుండా సాదాసీదా కుర్రాడిలా కనిపించడానికి ప్రయత్నించాడతను. కానీ పాత్రలో బలం లేకపోవడం వల్ల సుహాస్ పెద్దగా చేయడానికేమీ లేకపోయింది. హీరోయిన్ మాళవిక మనోజ్ గ్లామర్ పరంగా వీకే. తమిళంలో ‘జో’ సినిమాతో మంచి నటిగా పేరు తెచ్చుకున్న ఆమెకు.. తెలుగు అరంగేట్రంలో సరైన పాత్ర దక్కలేదు. గందరగోళంగా అనిపించే సత్యభామ పాత్రలో ఆమె ప్రత్యేకతను చాటుకోవడానికి అవకాశం లేకపోయింది. హీరో మేనమామ పాత్రలో ఆలీ సీరియస్‌గా నటించి మెప్పించాడు. తనను ఇలాంటి పాత్రల్లో చూడడం కొత్తగా అనిపిస్తుంది. హీరో స్నేహితుల పాత్రల్లో నటించిన ఆర్టిస్టులు కొంత నవ్వించారు. హీరోయిన్ తండ్రి పాత్రలో కనిపించిన పృథ్వీరాజ్ గురించి చెప్పడాని కేమీ లేదు. రవీంద్ర విజయ్ నెగెటివ్ రోల్ లో ఓకే అనిపించాడు. చాన్నాళ్ల తర్వాత తెలుగు తెరపై కనిపించిన ‘నువ్వు నేను’ అనిత బాగా చేసింది. ఇకముందూ ఆమెకు ఇలాంటి పాత్రలు ఆఫర్ చేయొచ్చు.

### సాంకేతిక వర్గం:

అందాల రాక్షసి.. అర్జున్ రెడ్డి ఫేమ్ రధన్ అంటే పాటల విషయంలో చాలా ఊహించుకుంటాం. కానీ ‘ఓ భామ అయ్యో రామ’లో తన స్థాయిలో తగ్గ పాటలు పడలేదు. ఒక మెలోడీ పర్వాలేదనిపిస్తుంది. మిగతా పాటలన్నీ మామూలుగా సాగిపోయాయి. నేపథ్య సంగీతం కూడా అంతంతమాత్రమే. మణికందన్ ఛాయాగ్రహణం పర్వాలేదు. ఇక రైటర్ కమ్ రామ్ గోదాల.. ఈ కథతో ఏం చెప్పాలనుకున్నాడో అర్థం కాదు. ప్రధాన పాత్రలను అతను సరిగా తీర్చిదిద్దుకోలేదు. కథలో కీలకమైన అంశాలను సరిగా తెరపై ప్రెజెంట్ చేయలేకపోయాడు. రైటింగ్.. డైరెక్షన్ రెండూ వీకే.

## దుడ్డు ప్రభాకర్‌ను వెంటనే విడుదల చేయాలి

(సత్యంన్యూస్, టెక్కలి)

కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్‌పై ఎన్ఐఏ పోలీసులు అక్రమంగా కేసు బనాయించి గత రెండేళ్లుగా ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలో జైల్లో నిర్బంధించారని, బెయిల్ రాకుండా అడ్డుకుంటూ అక్రమంగా నిర్బంధించిన దుడ్డు ప్రభాకర్ తదితరులను వెంటనే విడుదల చేయాలని కుల నిర్మూలనపోరాట సమితి జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకర్ డిమాండ్ చేశారు. దీనిని నిరసిస్తూ ఈనెల 19న ఒంగోలులో కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు అంబేద్కర్‌భవన్‌లో జరుగుతుందన్నారు. ఈమేరకు దీనికి సంబంధించిన కరపత్రాన్ని స్థానిక గొడగలివీధిలో శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజల పక్షాన నిలబడి ప్రజల హక్కుల కోసం పోరాడుతూ ఆకలి, అంటరానితనం లేని సమాజం కోసం నిరంతరం పోరాటం చేసి దళిత, పిడితుల పక్షంగా నిలబడిన దుడ్డు ప్రభాకర్‌ను అక్రమంగా అరెస్టు చేసి గత రెండు సంవత్సరాలుగా జైల్లో నిర్బంధించడం అన్యాయమన్నారు. తక్షణమే దుడ్డు ప్రభాకర్‌ను విడుదల చేయాలన్నారు. జులై 19వ తేదీన ఒంగోలులో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఈ సభలో హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ బి.సుదర్శన్ (పీస్ డైలాగ్ కమిటీ అధ్యక్షులు) డాక్టర్ ఎం. ఎఫ్. గోపినాథ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, వీక్షణం ఎడిటర్ యన్.వేణుగోపాల్ తదితరులు పాల్గొని మాట్లాడుతారన్నారు. కార్యక్రమంలో డీటీఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కోత. ధర్మారావు, కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క.కృష్ణయ్య, బీసీ సంఘం నాయకుడు లోక్నోజీ. కేశవరావు, ముంజెటి కృష్ణ, రాము, శంకర్, సరోజినీ, జానకమ్మ, తులసిబాయి, రామారావు, భగీరతి తదితరులు పాల్గొన్నారు.




## 14న ప్రత్యేక పూజలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మొండేటి వీధిలో వెలసిన లక్ష్మీ గణపతి స్వామి వారి దేవాలయంలో ఈనెల 14న సంకష్టహర చతుర్థి పర్వదినం సందర్భంగా ఉదయం 6గంటల నుండి స్వామివారి ఉత్సవమూర్తికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 6గంటలకు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం లక్ష్మీ గణపతి మూల మంత్ర హోమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో యావన్మంది భక్తులు పాల్గొని స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

## ఆపదలో ఉండేవారికి చేయూతనిద్దాం



(సత్యంన్యూస్, నరసన్నపేట)

ఆపదలో ఉండేవారికి చేయూతనిద్దామని ఈశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ మార్పు విజయకుమార్ శనివారం అన్నారు. స్థానిక ఇందిరానగర్ కాలనీలో నివాసముంటున్న నాగరాజు, మీనా దంపతుల కుమారుడు శ్యాంచరణ్ నిరుపేద కుటుంబానికి చెందినవాడని, బ్రతుకుతెరువు కోసం నాగరాజు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లగా, కుమారుడు కె.శ్యాంచరణ్‌కు ఇటీవలే జరిగిన ఆటో ప్రమాదంలో తీవ్రగాయాల పాలయ్యారు. చిన్నారి ఈదులవలస మోడల్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నారని, ఆటోలో పాఠశాలకు వెళుతుండగా జరిగిన ప్రమాదంలో కాళ్లు చేతులు, కాలర్ బోన్ విరిగిపోవడంతో, తలకు తీవ్రమైన గాయాలయ్యాయన్నారు. మెరుగైన వైద్యం కోసం, శ్రీకాకుళం కిమ్స్‌కు తరలించగా, పరిశీలించిన వైద్యులు విరిగిన కాళ్ళు, చేతులకు శస్త్ర చికిత్స అవసరమని, బ్రెయిన్‌కు రంధ్రం ఏర్పడిందని తెలపగా, పేద కుటుంబం కావటంతో స్పందించిన, ఈశ్వర్ చారిటబుల్‌ట్రస్ట్ మార్పు విజయకుమార్ స్నేహితులు, దాతలు సహకారంతో రూ.1.50లక్షలు ఆర్థిక సహాయాన్ని, బాధిత కుటుంబ సభ్యులకు అందించి అండగా నిలిచారు. మనసున్న దాతలు, ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కుటుంబానికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాధిత కుటుంబసభ్యులు, ఈశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఉపాధ్యక్షులు ఉర్లం శివతేజ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల పట్టాల పంపిణీకి అర్హుల జాబితా సిద్ధం చేయండి

(సత్యంన్యూస్, నిమ్మాడ)

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీకి స్థలాన్ని సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ అంశాలపై నందిగాం మండలంకు సంబంధించి పలాస, టెక్కలి మండలాల రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ప్రస్తుతం గృహ నిర్మాణ లే అవుట్లలో ఎంతమంది లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకొన్నది, నిర్మాణం జరపవలసిన లబ్ధిదారుల వివరాలు అధికారులను ప్రశ్నించగా నందిగాం మండలంలోని లే అవుట్‌లో 1453 గృహాలు అర్హులకు మంజూరు చేయగా 236 మంది లబ్ధిదారులు ఇల్లు నిర్మాణం జరపగా, 1021 ఇళ్ల స్థలాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సొంతింటి కల సాకరానికి అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇల్లు మంజూరు చేయాలని దృఢనిశ్చయంతో ఉన్నట్లు స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను సమగ్ర ప్రణాళికతో, జాబితాను సిద్ధం చేయాలని టెక్కలి, పలాస రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎం.కృష్ణమూర్తి, వెంకటేష్‌లను ఆదేశించారు. త్వరలో పంపిణీకి చేసేందుకు వీలుగా అర్హుల జాబితాను తయారు చేయాలని చెప్పారు. ఇళ్ల స్థలాల లే అవుట్‌లను స్వయంగా వెళ్లి పరిశీలించాలని సూచించారు. నిర్దిష్ట ప్రణాళికా బద్ధంగా ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు కృష్ణమూర్తి, వేంకటేష్, సంబంధిత తహశీల్దార్‌లు పాల్గొన్నారు.



## 10 పరీక్షలలో ప్రతిభ చూపిన విద్యార్థికి సన్మానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాగోలు ఉన్నత పాఠశాలలో చదివి 571 మార్కులు సాధించి నూజివీడు ఐఐఐటీలో సీటు సాధించిన కంటిపాము శిరీషని ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు గేదెల శ్యామలరావు మాట్లాడుతూ శిరీష ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆమె ఉన్నతస్థానానికి చేరుకోవాలని కోరుతున్నారు. రాగోలు ఉన్న పాఠశాల నుండి నవోదయ, ఐఐఐటీకి విద్యార్థులు ఎంపికవడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జనార్ధనరావు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



## ప్రపంచానికి మానవ వనరులు ఎంతో అవసరం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆర్ట్స్ కళాశాల దరిలో గల కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్ అధ్యక్షత వహించగా, వైస్ ప్రిన్సిపాల్ జి.జి.వి.సుబ్రహ్మణ్యం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మోహన్ రావు సుమారు 250మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్ మాట్లాడుతూ భారతదేశ జనాభా ప్రపంచంలో రెండోస్థానంలో నిలిచిందని, భారతదేశంలో మానవ వనరులు అత్యధికంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం జనాభాను ఒక మానవ వనరుల సూచికగా పరిగణిస్తున్నారని, ప్రతిఒక్కరూ జనాభా పెరుగుదలపై మంచి అవగాహన కలిగించుకోవాలన్నారు. తద్వారా మానవ వనరులను పెంచాలన్నారు. దేశంలో యువత జనాభా అత్యధికమని, దీని వలన మంచి అభివృద్ధి సాధ్యమని తెలిపారు. అనంతరం కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రసంగించి ప్రపంచ జనాభా ప్రాముఖ్యతను వివరించారు. ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు వకృత్వ, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు.



## సెలవు రోజుల్లో నడుపుతున్న కాలేజీలపై చర్యలు తీసుకొండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రెండవ శనివారం కాలేజీలు రన్ చేస్తున్నారని వివిధ కాలేజీలకు చెందిన విద్యార్థులు ఎస్ఎఫ్ఐ చెప్పడంతో వారు కాలేజీలకు వెళ్లి సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి పవిత్ర, డి.చందు మాట్లాడుతూ శ్రీకాకుళం నగరంలో కార్పొరేట్ కాలేజీలు అయిన నారాయణ, శ్రీ చైతన్య డౌట్స్ అనే పేరుతో క్లాసులు చెప్తున్నా విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. 80 ఫీట్‌లో గల నారాయణ కాలేజీపై ఎన్నో ఆరోపణలు వస్తున్నా కూడా చీమకుట్టినట్టు కూడా విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. రెండవ శనివారం సెలవు దినంలో క్లాసులు పెట్టడం, అధిక ఫీజులతో కాలేజ్ రన్ చేయడం, పుస్తకాలు, యూనిఫామ్ పేరుతో విద్యార్థులపై ఒత్తిడి తీసుకొచ్చి అవి కొనగా సెలవు దినాల్లో కూడా కాలేజీ రన్ చేయడం అనేది సిగ్గుచేటన్నారు. ఆర్ఐఓ దుర్గాప్రసాద్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. విదేశాల్లో ఇతర దేశాల్లో పిల్లలు గేమ్స్‌లో, మేధస్సులో ఎంతో ఎత్తుకు వెళ్తున్నారంటే శారీరకంగా మానసికంగా ఉన్న ఆహ్లాదకరమైన వాతావరణం, వారు పెరిగిన కల్చరలేనన్నారు. ఈ పరిస్థితుల్లో సెలవు రోజుల్లో కూడా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి కాలేజ్ నడుపుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి పి.ఖగేష్, జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.జైరామ్ శ్రీకాకుళం హాస్టల్ కమిటీ సభ్యుడు వీరాజ్ టౌన్ కమిటీ సభ్యుడు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం తరలింపుపై విజిలెన్స్ దాడులు

(సత్యంన్యూస్, పార్వతీపురం మన్యం)

ప్రాంతీయ నిఘా, అమలు అధికారి బర్ల ప్రసాదరావు ఆదేశాల మేరకు విజిలెన్స్, రెవెన్యూ అధికారులు పాచిపెంట మండలం పి.కోనవలస చెక్‌పోస్ట్ వద్ద ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కొత్తూరు మండలం కడుమ గ్రామం నుండి ఒడిశా రాష్ట్రం (నవరంగపూర్)కు పీడీఎస్ బియ్యంతో నిండిన లారీను తనిఖీ చేయగా వాహనంలో సుమారు రూ.15,83,400లు విలువ గల 34,800 కిలోల బరువున్న 700 బస్తాల పీడీఎస్ బియ్యంను కడుమ గ్రామంనకు చెందిన రైస్‌మిల్ యజమాని గోవిందరావు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. విచారణలో పైన పేర్కొన్న పిడిఎస్ బియ్యం కొత్తూరు మండలం, కడుమ గ్రామంలోని తెల్లకార్డు లబ్ధిదారుల నుండి సేకరించి ఒడిశా రాష్ట్రంలోని నవరంగపూర్‌లో విక్రయిస్తామని డ్రైవర్ తెలిపాడు. విజిలెన్స్ అధికారులు 700 బస్తాల పిడిఎస్ బియ్యం, లారీని స్వాధీనం చేసుకుని సిఎస్‌డిటికి అప్పగించారు. రైస్ యజమాని గోవిందరావు, మానేపల్లి వెంకటేష్ (వాహనడ్రైవర్)లపై కేసులు నమోదు చేయాలని, అవసరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఎస్‌డిటికి తెలిపారు. పై తనిఖీలలో విజిలెన్స్ ఇన్స్పెక్టర్ సింహాచలం, సబ్ ఇన్స్పెక్టర్ రామారావు, పోలీస్ కానిస్టేబుళ్లు పురుషోత్తమ్, తిరుపతిరావు, రెవెన్యూశాఖ అధికారి హేమలత, పాచిపెంట సీఎస్‌డీటీ పాల్గొన్నారు.



## భవానికి రాష్ట్రస్థాయి 2వ ర్యాంక్



(సత్యంన్యూస్, మందస)

మందస మండలం మధ్య గ్రామానికి చెందిన సానపతి భవాని 2025 ఆంధ్రప్రదేశ్ కానిస్టేబుల్ ఉద్యోగానికి రాష్టంలోని 2వ ర్యాంక్ సాధించారు. మహిళా కేటగిరిలో శ్రీకాకుళం జిల్లా కు 1వ ర్యాంక్‌లో మహిళా కానిస్టేబుల్ ఉద్యోగానికి 154 మార్కులతో విజేతగా నిలిచి మహిళా కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. తల్లిదండ్రులు భారతి, శ్యామలరావు, భర్త గిరిబాబులు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. 1 వ తరగతి నుంచి 7 వ తరగతి వరకు మధ్య మారుమూల గ్రామంలో విద్యను అభ్యశించారు. 8 వ తరగతి నుంచి 10వ తరగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిఆర్ పురంలోనూ ఇంటర్ పలాస, డి ఈ డి వెస్ట్ గోదావరి లోను డిగ్రీ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో విద్య ను అభ్యశించారు. మారుమూల పల్లెటూరు మధ్య గ్రామంలో విద్య అభ్యసించిన సానపతి భవాని పేదరికం వల్ల తల్లి దండ్రులు వ్యవసాయ కూలీలు కావడం తో ఉన్నత చదువులు చదవలేకపోయింది. గ్రామస్తులు, స్నేహితులు అభినందించారు.

## 18న జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షకు తరలిరండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం ఎన్జీవో హోంలో శనివారం జరిగిన మెమో 57 సాధన సమితి సమావేశంలో జిల్లా కన్వీనర్ కే.శ్రీహరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57కి అర్హత ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని,ఇందుకు ఈ ప్రభుత్వం తమ యువగళం పాదయాత్రలో లోకేష్ మాట ఇచ్చారని, వారు ఇచ్చిన మాట ప్రకారం మెమో 57ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. 2004 జనవరి 1కు ముందు నోటిఫికేషన్ వచ్చి కొన్ని అడ్మినిస్ట్రేటివ్ కారణాలవల్ల జాయినింగ్స్ లేట్ అయినప్పటికీ పిఎఫ్ ఆర్‌డిఏ చట్టం అమలకు ముందే నోటిఫికేషన్ వచ్చినందున వీరందరూ పాత పెన్షన్‌కి అర్హులేనని అందుకోసం అర్హత కలిగిన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 11వేల మందికి పాత పెన్షన్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున పోరాటం తప్పదని పేర్కొన్నారు. ప్రతీ బాధితుడు తమతమ ఇంటి లోనే గృహ దీక్షను చేపట్టాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ఈనెల 18న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద నిరసన దీక్షను 2003 డిఎస్సీ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. కావున శ్రీకాకుళం జిల్లా బాధిత ఉద్యోగులంతా జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టబోయే నిరసనకు అధిక సంఖ్యలో హాజరై పాతపింఛన్ సాధనలో భాగస్వామ్యం కావాలని కోరారు. సమావేశంలో జిల్లా కో-కన్వీనర్లు అంబటి లక్ష్మణరావు, అట్టాడ తిరుమలేశ్వరరావు, కోర్ కమిటీ సభ్యులు, గురుగుబెల్లి భాస్కరరావు, నంబూరి కృష్ణారావు ఇప్పిలి సురేశ్‌కుమార్, దుంపల అనిల్ బాబు, కె.రామకృష్ణ, డి.రమణ, ఎస్.ఫాల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ కేంద్రాలు ఆరోగ్యసంజీవనిలు



(సత్యంన్యూస్, సోంపేట)

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంగా నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రాలు బుడిబుడి అడుగులు వేసే చిన్నారులు పట్ల ఆరోగ్యసంజీవని అని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ (సిఆర్‌పిఎఫ్) శ్రీకాకుళం జిల్లా కో కన్వీనర్ ఎల్.గోవిందరాజులు, జిల్లా కార్యదర్శి సాలిన నరసింహులు యాదవ్ అన్నారు. శనివారం వారు జలంతారు సోంపేట హనుమాన్ కాలనీలో గల అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారుల పట్ల అంగన్వాడి కార్యకర్త నిమ్మడ సరోజినీ, సహాయక కార్యకర్త పి.ఉమా మహేశ్వరిలు తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధను వారు ప్రశంసించారు. బాలలు, బాలింతలు కోసం సరఫరా చేస్తున్న పౌష్టిక ఆహారం తగు రీతిలో ఈకేంద్రం నుంచి సరఫరా జరుగుతుందన్నారు చిన్నారులకు వండిపెట్టే వంట పాత్రలు కూడా పరిశుభ్రంగా ఉన్నాయన్నారు. ఇక్కడ ప్రధాన సమస్యగా తాగునీరు ఉందని, ఈ సమస్యను సోంపేట పంచాయితీ కార్యనిర్వాహక అధికారి దృష్టికి తీసుకువెళ్ళగా, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. సోంపేట ప్రాజెక్ట్‌కు చెందిన అంగన్వాడీ కేంద్రాలు తూతూ మంత్రాంగానే నడుస్తున్నాయని, దీనిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇద్దరు, ముగ్గురు పిల్లలతో కూడా కేంద్రాలు నిర్వహిస్తున్నారని, ఈ విధానం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమన్నారు. కేంద్రాలను పర్యవేక్షించి తప్పుడు నివేదికలు ఇస్తున్న సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.













# కక్షల కోలాటం.. ఫరీదుపేట కల్లోలం!

- ఒకే సామాజికవర్గం.. వేర్వేరు కుంపట్లు
- రక్షణ ఛత్రంగా రాజకీయ పార్టీలు
- ఏ పార్టీ అధికారంలో ఉంటే వారిదే ఆధిపత్యం
- యథాశక్తి కొమ్ము కాస్తున్న ఎచ్చెర్ల పోలీసులు
- ఇరువర్గాలను లొంగదీస్తే తప్ప దాడులు ఆగవు

**ఫ్యాక్షన్ హత్యలకు కేరాఫ్‌గా నిలిచిన ఫరీద్‌పేటలో ఆ దుష్ట సంస్కృతికి ముగింపు కనిపించడంలేదు. ఆధిపత్య పోరులో వైరిపక్షాలు పరస్పరం దాడులకు పాల్పడుతున్నాయి. అయితే ఇది కాస్త తగ్గుముఖం పట్టిందని భావిస్తున్న ప్రతిసారీ ఏదో ఒక హత్య జరుగుతోంది. గ్రామంలో పోలీస్ పికెట్ ఉన్నా శత్రువులను అనాయసంగా మట్టుబెట్టేస్తున్నారు. వైకాపా అధికారంలో ఉంటే టీడీపీ నాయకులు, టీడీపీ అధికారంలో ఉంటే వైకాపా నేతలే టార్గెట్‌గా దాడులు, హత్యలు జరుగుతున్నాయి. ఇదే నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన సత్తారు గోపి హత్యకు ప్రత్యేకమైన కారణాలేవీ అక్కర్లేదు. ఫరీద్‌పేటలో రెండు పార్టీలుగా, రెండు వర్గాలుగా విడిపోయినవారే ఆధిపత్యం సాధించేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగమే ఈ హత్యలని స్పష్టమవుతోంది.**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రస్తుత ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి తన మాట చెల్లుబాటైన రోజుల్లో రాజకీయ ప్రత్యర్థులు, వారి కుటుంబాలు గ్రామంలో లేకుండా చేసుకున్నారు. దాంతో ప్రాణభయంతో ఎక్కడికెక్కడికో పారిపోయిన ఒక వర్గానికి చెందినవారు పక్క జిల్లా, పక్క రాష్ట్రం నుంచే మొదలవలస చిరంజీవిని అంతం చేసేందుకు స్కెచ్ వేశారు. అయితే రెక్కీ నిర్వహిస్తుండగా విశాఖ పట్నం పోలీసులకు దొరికిపోయారు. ఈ నేపథ్యంలో ఫరీద్‌పేటలో తరచూ ఏదో ఒక గ్రూపునకు చెందిన వ్యక్తులు ఫ్యాక్షన్ రాజకీయాల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా జరిగిన సత్తారు గోపి హత్య కేసును తానే స్వయంగా దర్యాప్తు చేస్తానని సాక్షాత్తు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డే బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారంటే ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏదో జరుగుతోందని అర్థమవుతుంది. ఫరీద్‌పేటలో హత్యలు, దాడులు జరగడం ఇదే మొదటిసారి కాదు. అందుకే దీన్ని సమస్యాత్మక గ్రామంగా గుర్తించారు. సుమారు ఇరవై మందే గ్రామంలో అశాంతికి, దాడులకు కారణమవుతున్నారని గుర్తించి వారిపై రౌడీ షీట్‌లు తెరిచారు. ఎవరు ఎవరిపై దాడులు చేయవచ్చు, వాటిలో ఎవరెవరి భాగస్వామ్యం ఉండొచ్చన్న సమాచారం పోలీసుల వద్ద ఉంది. అందుకే అక్కడ పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. అయినా దాడులు, హత్యలను ఆపలేకపోతున్నారు. ప్రోలీసు వైఫల్యమే దీనికి కారణమని స్థానికులు నిందిస్తున్నారు.

## పోలీసుల తీరుపై ఆరోపణలు

ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అనుచరుడిగా, వైకాపా నాయకుడిగా ఎదిగిన సత్తారు గోపి(46) హత్య అనంతరం పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘటన అనంతరం గ్రామాన్ని సందర్శించిన ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డికి ఎచ్చెర్ల పోలీసులు అనుసరిస్తున్న వైఖరి కారణంగానే గోపి హత్య జరిగిందని స్థానికులు ఫిర్యాదు చేయడం దీనికి నిదర్శనం. ఈ కేసులో ఎచ్చెర్ల పోలీసు అధికారిని నిందితుడిగా చేర్చాలని వారు డిమాండ్ చేయడం గమనార్హం. గ్రామానికి చెందిన వైకాపా కార్యకర్త కూన ప్రసాద్‌పై 2024 ఆగస్టు 18న దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయన అదే నెల 24న మృతి చెందాడు. ఈ కేసులో తొమ్మిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు నలుగురిని మాత్రమే నిందితులుగా చూపించారు. వీరికి యాంటిసిపేటరీ బెయిల్ వచ్చేలా పోలీసులే సహకరించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశాన్ని కూడా బాధిత కుటుంబీకులు ఎస్పీ వద్ద ప్రస్తావించినట్టు తెలిసింది. ఆ హత్య కేసులో ప్రధాన నిందితులను విడిచిపెట్టడం వల్లే మరో హత్య జరిగిందని వారు వివరించినట్లు తెలిసింది.

## రెండు దశాబ్దాల కక్షలు

ఫరీద్‌పేటలో 2001 జూన్ 21న ఎంపీపీ ఉపాధ్యక్షుడిగా పని చేసిన కాంగ్రెస్ నాయకుడు కోటి పాత్రుని అప్పలనాయుడు హత్యకు గురయ్యారు. దీనికి



ప్రతీకారంగా 2002 ఆగస్టు 24న టీడీపీకి చెందిన మొదలవలస రాంబాబు హత్య జరిగింది. గత ఏడాది ఆగస్టు 24న వైకాపా కార్యకర్త కూన ప్రసాద్ మృతి చెందాడు. సరిగ్గా 11 నెలల తర్వాత ఇప్పుడు మరో హత్య జరిగింది. గతంలో టీడీపీ హయాంలో కలెక్టర్ లక్ష్మీనృసింహం ఆదేశాలతో ఎస్పీ ఖాన్ వైకాపాకు చెందిన మొదలవలస చిరంజీవి, సత్తారు గోపితో పాటు మరో ఇద్దరిపై రౌడీషీట్ తెరిచారు. పంచాయతీ కార్యదర్శిపై దాడి చేసినందుకు వారిపై ఈ చర్య తీసుకున్నారు. తర్వాత వైకాపా అధికారంలోకి రావడంతో వీరి ప్రత్యర్థులైన అమ్మినాయుడు, రంగనాధంతో పాటు మరో ముగ్గురిపై రౌడీషీట్ తెరిచారు. వీరిలో కొందరు అజ్ఞాతంలో ఉన్నారు. ఈ వివరాలన్నీ తెలుసుకున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి పోలీసులు గుర్తించిన 20 మంది వైకాపా, టీడీపీ నాయకులపై పీడీ యాక్ట్ పెట్టడానికి ఆరు నెలల క్రితమే ప్రయత్నించారు. దీన్ని ఎచ్చెర్ల పోలీసులు లీక్ చేయడంతో జిల్లా పార్టీ ప్రముఖుల ద్వారా పోలీసులపై ఒత్తిడి తెచ్చి పీడీ యాక్ట్ నమోదు చేయకుండా అడ్డుకున్నారని విశ్వసనీయ సమాచారం.

## ఆధిపత్యం కోసం వేరుకుంపట్లు

ఎచ్చెర్ల రాజకీయాల్లో కేంద్ర బిందువుగా ఉన్న ఫరీద్‌పేటలో హత్యలకు గురైనవారు, ఆ కేసులతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్నవారంతా ఒకే సామాజికవర్గానికి చెందినవారు. ఆధిపత్యం విషయంలో విభేదాలతోనే వేరు కుంపట్లు పెట్టుకొని, వేర్వేరు పార్టీల్లో చేరి పరస్పరం ప్రతీకార దాడులకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఆ క్రమంలోనే ఫరీద్‌పేటలో నాలుగు హత్యలు, రెండు హత్యా యత్నాలు జరిగాయి. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యర్థులు నామినేషన్లు వేయకుండా వైకాపావారు అడ్డుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణం వల్లే ఎచ్చెర్లలో వైకాపా విజయం సాధించిందని టీడీపీ ఆరోపించింది. దీనిపై ప్రతీకారం తీర్చుకునేందుకు అప్పటినుంచే ఫరీద్‌పేట టీడీపీ నేతలు సమాయత్తమయ్యారు. అందులో భాగంగా పీడీ యాక్టు నమోదు కాకుండా జాగ్రత్తపడ్డారని తెలిసింది. ఒకవేళ పీడీ యాక్ట్ నమోదు చేయాల్సి వస్తే వైకాపాకు చెందిన వారిపై కూడా పెట్టాల్సి ఉంటుంది. అప్పుడే గ్రామంలో కొంతమేరకు ప్రశాంతత నెలకొంటుంది. కానీ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన రౌడీషీటర్లను విచ్చలవిడిగా తిరగనిచ్చారు. ఇక్కడ ఎచ్చెర్ల ఎస్ఐ ఎవరనేది అప్రస్తుతం. ఎందుకంటే.. అందరూ అదే పని చేశారు.



## కక్షలకు రాజకీయ ముసుగు

సత్తారు గోపి హత్య రాజకీయ కోణంలో జరగలేదని పోలీసులు చెబుతున్నారు. అయితే పోలీసుల వాదన అవాస్తవమని స్థానికులు చెబుతున్నారు. ఎందుకంటే సత్తారు గోపిని హత్య చేసినవారంతా ఆయన బాధితులే. గతంలో సత్తారు గోపిపై ఇలాంటివారు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగానే కేసులు నమోద య్యాయి. అందువల్ల ఇది కేవలం కుటుంబ కలహమో, మరొకటో కాదు. బాధిత కుటుంబాలు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ హత్య కేసులో ప్రత్యక్షంగా తొమ్మిది మందికి పరోక్షంగా ముగ్గురికి ప్రమేయం ఉన్నట్లు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. 300 మంది పోలీసు సిబ్బందితో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. పార్టీల మధ్యే కాకుండా వ్యక్తుల మధ్య కూడా ఆధిపత్య పోరు కారణంగా హత్యలు, హత్యాయత్నాలు జరిగాయి. వైకాపా నాయకుడు జరుగుళ్ల శంకర్‌పై స్వయంగా అదే పార్టీకి చెందిన ఎంపీపీ మొదలవలస చిరంజీవి వర్గం కొన్నాళ్ల క్రితం హత్యాయత్నం చేసింది. అదృష్టవశాత్తు ఆయన ప్రాణాలతో బయటపడ్డారు. దీనికి ప్రత్యర్థి పార్టీ అనే కోణం లేదు. కేవలం తమకు వ్యతిరేకంగా ఉన్నవారిని అంతమొందించడమే లక్ష్యంగా ఇక్కడ ఫ్యాక్షన్ రాజకీయాలు నడుస్తున్నాయి. వీరంతా ఒక్కో పార్టీ గొడుగు నీడలో ఉండటం వల్ల వీరికి రాజకీయ రక్షణ లభిస్తోంది. ప్రధాన పార్టీలన్నీ రౌడీషీటర్లు, గ్యాంగ్‌స్టర్లు తమ పార్టీలో ఉండకూడదన్న నిబంధన పెట్టేవరకు ఇక్కడ కక్షలు చల్లారవు.

---

# నాణ్యతపై ఫిర్యాదు చేసినందుకు దాడి

- సామాజిక కార్యకర్త రాజశేఖర్

(సత్యంన్యూస్, నరసన్నపేట)

ఉపాధి హామీ పథకం నిధులతో పల్లె పండుగలో భాగంగా జలుమూరు మండలం శ్రీముఖలింగం కరకట్టపై వేసిన సీసీ రోడ్డులో నాణ్యత లేదని ఫిర్యాదు చేసినందుకు దాడి చేశారని సామాజికకార్యకర్త నాయుడు గారి రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలి పారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు దుర్వినియోగానికి పాల్పడి సీసీ రోడ్డును ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యత ప్రమాణాలు పాటించలేదని పీఆర్ చీఫ్ ఇంజనీర్‌కు ఫిర్యాదు చేసినందున బిల్లులు నిలిపేశారని తెలిపారు. తన ఫిర్యాదుతోనే బిల్లు పెండింగ్‌లో పెట్టారని రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ తర్ర బలరాం, తర్ర కృష్ణ, వాన అప్పన్న, వాన రమేష్, నేతింటి గడ్డయ్య, పి. లక్ష్మీనారాయణతో పాటు మరో నలుగురు శ్రీముఖలింగం బీసీ హాస్టల్ దగ్గర కర్రలతో



దాడి చేసి హత్యాయత్నం చేశారని పేర్కొన్నారు. స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చిజవ స్పందించకపోవడంతో ఎస్పీ కేవీ మహేశ్వరరెడికి ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. ఫిర్యాదుపై ఎస్పీ స్పందించడంతో స్థానిక సీఐ కేసు నమోదు చేశారని తెలిపారు. కూటమి నాయకులు దాడులతో భయపెట్టి అవినీతి నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారని పేర్కొన్నారు. దాడి విషయాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణంపై విచారణ జరిపించి కాంట్రాక్టర్ నుంచి ప్రజాధనాన్ని రికవరీ చేయాలని కోరారు. దౌర్జన్యాలు అరికట్టి సామాన్యులకు భద్రత కల్పించే చర్యలు చేపట్టాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

---

# ఎమ్మెల్యే ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం

- టీడీపీ నియోజకవర్గ నాయకులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నిజాయితీగా రాజకీయాలు చేసి ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో పని చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్‌పై సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తిగత ప్రతిష్ఠను దిగజార్చడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, దాన్ని ప్రజలు నమ్మరని టీడీపీ నాయకులు అన్నారు. శనివారం స్థానిక




జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కొన్ని దుష్టశక్తులు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఏడాది పాటు సొంత ఖర్చులతో అన్నా కాంటీన్‌ను నిర్వహించి పేదల ఆకలిని శంకర్ తీర్చారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన మరుక్షణం నుంచి ప్రజల మధ్యే రేయింబవళ్లు ఉంటూ వారి సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే శంకర్‌పై బురద చల్లటానికి ప్రయత్నిస్తున్న వ్యక్తుల చరిత్ర నియోజకవర్గ ప్రజలకు తెలుసన్నారు. సోషల్ మీడియాలో ఫోన్ రికార్డింగులను ఫేబ్రికేట్ చేసి ప్రజలను తప్పు తోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు దండుకొనే ప్రయత్నం తప్ప మరోటి కాదన్నారు. ఎమ్మెల్యేపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్న వారు టీడీపీ కార్యకర్తల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో పంచిరెడ్డి అప్పలనాయుడు, అల్లు నర్సయ్య, మూకళ్ల శ్రీనివాసరావు, కొంక్యాన ఆదినారాయణ, హరీష్, టీ.గోవిందరావు, వి.అనూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

---

# జిల్లాను టీడీపీ మోసగిస్తోంది

- ఈ ప్రాంతం బాగుకు ఎందాకయినా పోరాటం
- ఏడాది కాలంలో జిల్లా అభివృద్ధికి వెయ్యి కోట్లు కూడా ఖర్చు చేయలేదు
- వ్యక్తిగత విమర్శలు ఎందుకు చేయాలి?
- పార్టీ మార్పుపై నిరాధార కథనాలను నమ్మవద్దు
- కార్యకర్తలంతా క్షేత్రస్థాయిలో పాలన సంబంధ వైఫల్యాలు వివరించాలి
- మాజీ రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- శ్రీకాకుళం వైఎస్సార్ కాంగ్రెస్ కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అత్యంత వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాను టీడీపీ ఎప్పటికప్పుడు మోసం చేస్తూనే ఉందని, ఈ ప్రాంత అభివృద్ధిపై అస్సలు దృష్టి సారించిన సందర్భం ఒక్కటంటే ఒక్కటి కూడా లేదని మాజీ రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆవేదన చెందారు. స్థానిక వైఎస్సార్ కార్యాలయంలో (టౌన్ హాల్) జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాది కాలం పాలనలో కనీసం వెయ్యి కోట్లు కూడా ఈ ప్రాంతం అభివృద్ధికి కేటాయించలేక పోయారన్నారు. ఇది కూటమి ప్రభుత్వం కాదని, టీడీపీ ప్రభుత్వమని మాత్రమే వ్యవహరించాలన్నారు. పవన్ కల్యాణ్ గొంతు విప్పి మాట్లాడలేకపోతున్నారని, బీజేపీ అయితే ఎన్నికలకు ముందే చంద్రబాబు ప్రకటించిన మ్యానిఫెస్టోతో తనకేంటి సంబంధమంటూ ఆ నాయకులు సైడ్ అయిపోయారని అన్నారు. సోషల్ మీడియాను కేంద్రంగా, దాన్నొక ఆయుధంగా చేసుకుని పని చేయాలని సూచించారు. పార్టీ విధి విధానాలు, టీడీపీ పాలన సంబంధ వైఫ్యలాలు వీటి గురించి ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలన్నారు. మన దాహార్తి తీర్చే, పంటలకు నీళ్లిచ్చే వంశధార ప్రాజెక్టు పూర్తికే యాభై ఏళ్లు పట్టిందంటే పాలకులకు ఈ ప్రాంతమంటే ఎంతటి ప్రేమో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పూర్తి దృష్టి సారించి ఆఫ్‌షోర్, తోటపల్లి, నారాయణపురం వంటి ప్రధాన ప్రాజెక్టులకు నిధులు ఇచ్చింది వైఎస్సార్, జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని గుర్తుచేశారు.

పార్టీ ఆదేశిస్తే పార్లమెంట్‌కు పోటీ చేస్తానని, లేదా తన బదులు మరొకరికి నాయకత్వం ఇస్తే వారికి మద్దతు ఇస్తూ ప్రోత్సహిస్తూ పనిచేస్తానని, పార్టీ మాత్రం మారనని ధర్మాన స్పష్టం చేశారు. ప్రభుత్వానికి బాకాలు ఊదే పత్రికలను చదవవద్దని, నిరాధార కథనాలు నమ్మవద్దని సూచించారు. నాడు సచివాలయ వ్యవస్థలో నిష్పక్షపాతంగా పోస్టింగులు ఇచ్చామని, కానీ నేడు బదిలీల పేరిట ముడుపులు చెల్లిస్తే కానీ పని కావడం లేదన్నారు. నాడు రాజకీయ అవినీతికి తావులేకుండా పనిచేశామని, కానీ ఇప్పుడు డబ్బులు చెల్లిస్తే కానీ బదిలీలు కావడం లేదన్నారు. కార్యకర్తలంతా కలిసి పనిచేయాలని, గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. టీడీపీ విడుదల చేసిన మ్యానిఫెస్టో ఏంటి అన్నది క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే తెలిసిపోతుందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారిని చైతన్యవంతులను చేయాలని, క్షేత్రస్థాయిలో పార్టీకి ఉన్న పట్టు ఎంతన్నది నివేదిక రూపంలో పార్టీకి అందజేయాలని మాజీ మంత్రి ధర్మాన అన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, వైకాపా పార్లమెంటరీ పరిశీలకులు కుంభ రవిబాబు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మెంటాడ పద్మావతి, గేదెల పురుషోత్తం, యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, చిట్టి జనార్దన్ రావు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, పట్టణ అధ్యక్షులు సాధు వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.